## ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లికి బీఆర్ఎస్ నేతల సత్కారం



ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లిని సత్కరిస్తున్న కోటగిరి ప్రబోద్‌కుమార్, మానే రామకృష్ణ

భద్రాచలం, ఏప్రిల్ 6: భద్రాచలంలో ఆదివారం జరిగిన శ్రీసీతారాముల కల్యాణానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ హాజరయ్యారు. తొలుత పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు కోటగిరి ప్రబోద్‌కుమార్ నివాసానికి వెళ్లా రు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లిని ప్రబోద్‌కుమార్, నాయకులు మానే రామకృష్ణ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

## రామాలయంలో క్యూఆర్ కోడ్..!



క్యూఆర్ కోడ్‌తో కానుకలు చెల్లిస్తున్న భక్తులు

రామవరం, ఏప్రిల్ 6: మారుతున్న కాలానికి అనుగుణంగా దేవాలయాలు కూడా మారుతున్నాయని చెప్పడానికి ఇదొక నిదర్శనం. సాధారణంగా అన్ని దేవాలయాల్లో హుండీలు ఉంటాయి. వీటిలో భక్తులు కానుకలు వేస్తుంటారు. కానీ, కాలానుగుణంగా ఇప్పుడు అన్నీ మారుతున్నాయి. అంతా ఆన్‌లైన్ మయంగా మారింది. దేవాలయానికి వచ్చిన భక్తుల వద్ద తగిన నగదు లేకపోతే.. వారు కానుకలు ఎలా చెల్లిస్తారు..?! ఈ సమస్యకు సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ సీతారామాలయం నిర్వాహకులు పరిష్కారం కనుగొన్నారు. శ్రీరామ నవమి రోజైన ఆదివారం.. భక్తుల కోసం అక్కడక్కడా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అనేక మంది భక్తులు ఆ కోడ్ స్కాన్ చేసి కానుకలను ఆన్‌లైన్‌లో చెల్లించారు.

## భక్తులకు పులిహోర, పానకం పంపిణీ




భక్తులకు పులిహోర ప్యాకెట్లు అందిస్తున్న సంస్థ బాధ్యులు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 6: మండలంలోని సారపాకలో ఇండియన్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం భక్తులకు పులిహోర, బెల్లం పానకం పంపిణీ చేశారు. భారతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రతిఒక్కరూ తమ హక్కులను కాపాడుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు తిప్పల వీరవెంకటనాగేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సాగర్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, అవులూరి శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, ఇస్మాయిల్, సురేశ్ వర్మ, సతీశ్, దుర్గా భవానీ, సభ్యులు పాల్గొన్నారు.

## వేసవిలో కార్మికులు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న కేఓసీ పీవో గోవిందరావు

టేకులపల్లి, ఏప్రిల్ 6: వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉపరితల గనిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మల్లారెడ్డి, కశ్యప్ అన్నారు. ఆదివారం కేవోసీ పీవో ఆధ్వర్యంలో మండలంలోని కోయగూడెం ఓసీలో వేసవి కాలంలో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఓసీలో పని చేస్తున్న ఉద్యోగులందరికి ప్రత్యేకంగా మజ్జిగ, ఓఆర్ఎస్ తరుచుగా వాడాలన్నారు. కార్యక్రమంలో కేఓసీ పీవో గోవిందరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, పీ.శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీకాంత్, అజయ్, గుర్తింపు సంఘం నాయకులు కే.వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



కృష్ణను పరామర్శిస్తున్న నాయకులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 6: మండలంలోని రామానుజరం గ్రామ పంచాయతీ బీఆర్ఎస్ అధ్యక్షుడు లేళ్ల కృష్ణ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో మణుగూరు సొసైటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, వట్టం రాంబాబు, మద్దుంగుల కృష్ణ, జక్కుల రంజిత్‌కుమార్, వావిలాల నరసయ్య, సతీశ్, గుర్రం సృజన్, రావుల చంద్రయ్య, సిద్దు, చిట్టి ప్రసాద్, గుంట కేశవ్ ఉన్నారు.

## సీఎం పర్యటన సందర్భంగా అక్రమ అరెస్టులకు ఖండన

ఇల్లెందు, ఏప్రిల్ 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి జిల్లా పర్యటన సందర్భంగా సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్) నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్) ఇల్లెందు పట్టణ కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి అన్నారు.ఆదివారం పట్టణ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే వారిని అరెస్టులు చేస్తున్నారన్నారు. ముందస్తు అరెస్టులో భాగంగా నాయకులు కెచ్చల రంగారెడ్డి, మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని అరెస్టు చేస్తు అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు.

**T.G.CO-OP OILSEEDS GROWERS' FEDN Ltd.,**
9th Floor, Parisrama Bhavan, Basheerbagh, Hyderabad-500004.
TEL No: 040-23235501 / 02. E-mail: info@tgoilfed.in
No./ P&P/Palm Nut Transport/389/2020-21 Dt: 05.04.2025
**E TENDER/ BOX TENDER NOTICE**
TGOILFED, Hyderabad invites E-Tender/Box Tender from registered and experienced transporters who are in transportation field and able to arrange the vehicle transport the palm nuts as per our requirement at any movement for the **Transportation of Palm nut for a period of Two years from Oil palm Processing plant Ashwaraopet to Oil Palm processing plant Apparaopet, Bhadradri Kothagudem Dist., Telangana State.** The cost of the Tender Schedules is **Rs.2000/-** and can be collected from OPP Ashwaraopet, OPP Apparaopet and TGOILFED Head office, Hyderabad from **07.04.2025, 10.30 AM.** Publish of e-Tender **07.04.2025, 05.00 PM** and last date for uploading e-Tender /Submitting box tender document **15.04.2025, 3.00 PM.** All Details related to EMD & Tender Document will be available in e-Tender Website: **https://tender.telangana.gov.in. Contact No.: 9618888184,** Manager (P&P) - J. Satyanarayana.
**Sd/- MANAGING DIRECTOR**









పర్ణశాల: కల్యాణ క్రతువును జరిపిస్తున్న అర్చకులు, పాల్వంచ: కల్యాణోత్సవంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, చర్ల: ఆభయాంజనేయస్వామి ఆలయంలో.., పినపాక: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మహిళా భక్తులు



ఇల్లెందు: నాగుల్‌మీరా దర్గాలో శ్రీసీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## కల్యాణం.. కమనీయం

శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు, పూ జారులు కమనీయంగా నిర్వహించారు. భక్తులు తిలకించి తన్మయులయ్యారు. తొలుత స్వామివారికి తిరుమంజనం, పుణ్యాహవచనం, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల ఎదుట చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కల్యాణానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యం లో బెల్లం పానకం, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పాత పాల్వంచలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు.

**- నమస్తే నెట్‌వర్క్**



అశ్వారావుపేట టౌన్: చిన్నంశెట్టి బజార్‌లో జరిపిస్తున్న సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

# అడుగంటుతున్న అన్నదాత ఆశలు

- పొట్టదశలో ఎండిపోతున్న వరి, మొక్కజొన్న
- చింతగండి చెరువులో అడుగంటిన భూగర్భ జలాలు
- రేగళ్ల, తుమ్మలగూడెం, చౌప్పాల గ్రామాల రైతుల అవస్థలు



రేగుళ్ల గ్రామం చింతగండి చెరువు కింద ఎండిపోయిన మొక్కజొన్న పంట

కరకగూడెం, ఏప్రిల్ 6: మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కరువు పరిస్థితులు రోజురోజుకూ ఆందోళకరంగా మారుతున్నాయి. మండలంలోని రేగుళ్ల, తుమ్మలగూడెం, చౌప్పాల గ్రామాలకు సమీపంలో ఉన్న చింతగండి చెరువు కింద వందల ఎకరాల పంటలు సాగవుతున్నాయి. అయితే గత వర్షాకాలంలో చెరువుకు గండిపడడంతో ఇరిగేషన్ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంతో చెరువులో నీళ్లు అన్ని వృథాగా పోయాయి. దీంతో యాసంగి సాగు చేసిన వరి, మొక్కజొన్న రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఒకవైపు చెరువులో నీరు లేకపోవడం.. మరోవైపు పొట్టదశకు వచ్చిన పంటలకు బోరు నీరు కూడా అందడం లేదు, దీంతో పంటలు ఎండిపోతున్నాయి. అయితే గతేడాది చెరువుకు గండి పడితే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలు రైతుల కండ్ల ముందు ఎండిపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతుల పంటలు పరిశీలించి పంట నష్టపోయిన వారికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### చెరువు గండి పూడ్చకపోవడంతో పంటలు ఎండుతున్నాయి



చింతగండి చెరువు కింద ప్రతి ఏటా చుట్టుపక్కల మూడు గ్రామాల రైతుల పొలాలకు, అపరాల పంటలకు, యాసంగి సాగుకు సాగునీరందేది. అయితే గతేడాది వర్షాకాలం చెరువుకు గండి పడి నీరంతా వృథాగా పోయి చెరువులో చుక్కనీరు లేకుండా అయింది. అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి నీరు అందడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

**- గోగు కృష్ణ, రైతు, రేగుళ్ల గ్రామం, కరకగూడెం మండలం**

### నోటికాడికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి



ఆరుగాలం కష్టపడి రేయింబవళ్లు శ్రమించి పండించిన పంటలు సాగునీరు అందక నోటికాడికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం పూర్తిగా ఎండిపోయింది. కళ్లముందు పంటలు ఎండిపోతుంటే ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి సాగునీరు అందిస్తే పంటలు బతుకుతాయి. లేకపోతే అంతే సంగతులు.

**- రాజేశ్వరి, రైతు, రేగుళ్ల గ్రామం, కరకగూడెం మండలం**

# అలా వచ్చారు.. ఇలా వెళ్లారు!






బస్సుల కోసం వేచి చూస్తున్న భక్తులు, పోలీసు నియంత్రణ లేకపోవడంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

- భద్రాద్రిపై కురవని వరాలు జల్లు
- మీడియా ముందుకు రాని సీఎం
- మన్యంవాసుల ఆశలు అడియాశలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ) : సీఎం భద్రాచలం వచ్చారంట అంటే నిజమే వచ్చారు.. వెంటనే వెళ్లిపోయారు.. ఇది ప్రతి నోటా వినిపిస్తున్న మాట.. సీఎం వస్తున్నారంటే ఆ ప్రాంత, జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు కానీ వచ్చినట్టే వచ్చారు.. వెళ్లిపోయారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మన్యం ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వలేదు. భద్రాచలానికి వరాలు జల్లు కురిపించకపోవడంతో సర్వత్రా చర్చ జరుగుతున్నది. భద్రాచలం పట్టణాన్ని ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. వరదలు వస్తే కరకట్ట సమస్య, ముంపు మండలంలో ఉన్న ఐదు పంచాయతీలు తెలంగాణలో కలపాలని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని టెంపుల్ సిటీగా చేయడం వంటి వాటిని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇవన్నీ పక్కన బెట్టి ఎలాంటి హామీ కూడా ఇవ్వకుండా సీఎం వెళ్లిపోవడంతో ప్రజలు నిరాస చెందారు. ఏ ముఖ్యమంత్రి వచ్చినా అక్కడ స్థానిక సమస్యలపై మాట్లాడి కనీసం కొన్ని సమస్యలకైనా పరిష్కారం చేసి వెళ్తారు.. కానీ అక్కడ అది జరగకపోవడంతో సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లకుండా రాజకీయ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడంతో సమస్యలు ఆయన దృష్టికి రాకుండాపోయాయి.

# రిటైర్డ్ హెచ్‌ఎం ప్రాణం తీసిన ప్రభుత్వ వైఫల్యం!

**రిటైరై 9 నెలలైనా బెనిఫిట్స్ అందక మనోవేదనతో మృతి**



పాండురంగయ్య భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 6: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులుగా చేసేందుకు జీవితాంతం శ్రమించాడు ఓ ప్రధానోపాధ్యాయుడు. చదువుకుంటే కష్టాలు తొలగిపోతాయని, చదువుతోటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని హితబోధ చేస్తూ విద్యార్థులకు పాఠాలు నేర్పాడు. కానీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా అతడి విశ్రాంత జీవితం మానసికంగా వేదనాభరితమైంది. అనారోగ్యానికి గురైన వేళ మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. చివరికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం సకాలంలో అందించకపోవడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి మనోవేదనతో ప్రాణాలు వదిలాడు. ఆయనే ఖమ్మం జిల్లాకు చెందిన కూరపాటి పాండురంగయ్య.

ఖమ్మం ఏన్కూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కూరపాటి పాండురంగయ్య.. నిరుడు జూలైలో ఉద్యోగ విరమణ పొందాడు. ఇప్పటి తొమ్మిది నెలలు గడిచినా ఇంకా అతడికి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అందించలేదు. అప్పటికే అనారోగ్యం భారిన పడిన ఆయన.. తీవ్ర మనోవేదనతో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో ఉన్న అతడి భౌతికకాయాన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వ వైఫల్యమే పాండురంగయ్య మృతికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మానసిక ఒత్తిడితో..**

ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయన్న నమ్మకంతో ఖమ్మంలోని తన ఇంటిపైన మరో అంతస్తు నిర్మాణం చేపట్టారు. 9 నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించకపోవడంతో ఒత్తిడికి గురయ్యాడు. ఆ ఒత్తిడి అతడి ఆరోగ్యంపై ప్రభావం చూపింది. చివరికి చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య నిర్మల కూడా టీచర్‌గానే పనిచేస్తున్నారు. కాగా, పాండురంగయ్య.. కూసుమంచి, చింతకాని, కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో పనిచేశారు. యూటీఎఫ్‌లో అనేక బాధ్యతలు నిర్వర్తించారు.

**బెనిఫిట్స్ అందకనే ఒత్తిడికి లోనయ్యాడు..**

**రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు**

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం వల్ల అనేకమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవనాన్ని గడపలేకపోతున్నారు. పాండురంగయ్య కూడా కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం వల్లనే ఒత్తిడికి గురై తనువు చాలించాడు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, కమ్యుటేషన్, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలను ప్రభుత్వం అందించకపోవం వల్ల తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## చెరువులో పడి వృద్ధురాలు మృతి

పాల్వంచ, ఏప్రిల్ 6: చెరువులో పడి వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పాల్వంచ పట్టణంలోని కొమ్ముగూడెం(గొల్లగూడెం) నివాసి కోమటి నాగరత్నమ్మ(78) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నది. పాత పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నది. ఆ ఆస్పత్రికి శనివారం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. చింతలచెరువు కట్ట మీదుగా ఆదివారం వెళ్తున్న కొందరు.. అలుగు పక్కన వృద్ధురాలి మృతదేహాన్ని చూసి పోలీసులకు తెలిపారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి, విచారణ జరిపారు. ఆమెను కొమ్ముగూడెం నివాసి నాగరత్నమ్మగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆమె కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై సుమన్ దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత అదృశ్యం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 6: వివాహిత అదృశ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కేటీపీఎస్ కాలనీకి చెందిన మహిళ, తన భర్తతో కలిసి గత నెల 31న లక్ష్మీదేవిపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల తర్వాత ఆయన తమ క్వార్టర్‌కు వెళ్లిపోయాడు. ఆమె మాత్రం పుట్టింటిలోనే ఉంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం నుంచి ఆమె కన్పించడం లేదు. ఆమె తండ్రి అన్నిచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. తన కూతురు కనిపించడం లేదంటూ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదైంది.

## చెరువులో దొరికిన బైక్

అశ్వారావుపేట, ఏప్రిల్ 6: చేపల కోసం చెరువులోకి దిగిన మత్స్యకారులకు బైక్ దొరికింది. మండలంలోని తిరుమలకుంట గ్రామ మత్స్యకారులు చేపల వేట కోసం ఆదివారం సమీపంలోని ఊర చెరువులోకి దిగారు. అందులో వారికి బైక్ దొరికింది. దానిని బయటకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. దానిని ఎస్సై యయాతి రాజు పరిశీలించారు. ఆ బైక్, బూర్గంపాడుకు చెందిన రవీంద్రదిగా ఎస్సై గుర్తించారు. ఎనిమిది నెలల క్రితం తన బైక్ చోరీ అయిందని ఎస్సైతో రవీంద్ర చెప్పారు.

## ట్యాంకర్ ఢీకొని స్తంభం ధ్వంసం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 6: డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని యాష్ ట్యాంకర్ ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భద్రాచలం నుంచి కొత్తగూడెం వైపు ఆదివారం తెల్లవారుజామున యాష్ ట్యాంకర్ వెళుతున్నది. మండలంలోని జగన్నాథపురం వద్ద అది అదుపుతప్పి, డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ఫిర్యాదుతో రూరల్ పోలీసులు ఆ ట్యాంకర్ డ్రైవర్ రవికుమార్ పండిత్‌పై కేసు నమోదు చేశారు.

## క్రికెట్‌లో సత్తా చాటిన 11హిట్టర్స్ జట్టు



కప్‌తో 11హిట్టర్స్ జట్టు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 6: మణుగూరు నేతాజీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. ట్రయాంగిల్ టోర్నమెంట్ వన్డే కప్‌లో 11హిట్టర్స్ జట్టు సత్తా చాటింది. సింగరేణి జట్టు, ఆర్‌కే 11జట్టు, 11హిట్టర్స్ జట్లు మూడు జట్లు తలపడ్డాయి. మొదటి స్థానంలో 11హిట్టర్స్ జట్టు నిలబడి కప్పును కైవసం చేసుకుంది.

## నల్లమల గిరిప్రసాద్‌కు నివాళి



నల్లమల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 6: సీపీఐ జాతీయ నాయకుడు నల్లమల గిరిప్రసాద్ జయంత్యుత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. సయ్యద్ సలీమ్, గన్నిన రామకృష్ణ, విజయ్ కాంత్, జోగిరాజు, జక్కం బలరామ్, జయ్యద్ జాకీర్ పాల్గొన్నారు.

## బాధితులకు నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

పర్ణశాల, ఏప్రిల్ 6: మండలంలోని పిరాయిగూడెంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలం తరపున బాధితులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. మండలంలో ఏదైనా విపత్తు జరిగితే సహాయం నిమిత్తం అరుణాచలాన్ని సంప్రదిస్తే తోచిన సాయం చేయడానికి తామంతా ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి, చిన్న అరుణాచలం సేవా విభాగం డైరెక్టర్ ఆర్‌వీ మోహనాచారి, చిరంజీవి, భార్గవ్ కృష్ణ, నవీన్‌రెడ్డి, అర్చకులు శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.